## క్లుప్తంగా

### మహంకాళికి పొంగళ్లు



బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాటూరు గ్రామదేవత మహంకాళికి శనివారం గ్రామస్తులు పొంగళ్లు పెట్టారు. గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో మహంకాళికి ప్రత్యేక పూజలు చేశారు. మహంకాళి విగ్రహానికి పాలాభిషేకం చేసి, విశేషాలంకరణ, ప్రత్యేక పూజలు చేశారు. పొంగళ్లు పెట్టి ప్రసాదాలను పంపిణీ చేశారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

### వైఎస్సార్‌సీపీ నేత కేతారి శ్రీనివాసులు మృతి



బుచ్చినాయుడుకండ్రిగ: వైఎస్సార్ సీపీ నేత, కొత్తపాళెం మాజీ సర్పంచ్ కేతారి శ్రీనివాసులు అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన కొత్తపాళెం సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేశారు. గ్రామంలో నెలకొన్న పలు సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ఈయన మృతికి ప్రస్తుత సర్పంచ్ కేతారి సుబ్బరత్నమ్మ, హరిప్రసాద్, గ్రామస్తులు సంతాపం వ్యక్తం చేశారు.

### సీపీఐ మహాసభ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ: భారత కమ్యూనిస్టు పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి 28వ మహాసభ పోస్టర్లను శనివారం కనమనంబేడులో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చిన్నిరాజ, మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య, నాయకులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిన్నిరాజ మాట్లాడుతూ ఈనెల 23, 24, 25 తేదీల్లో ప్రకాశం జిల్లా ఒంగోలులో జరగనున్న భారత కమ్యూనిస్టు పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి 28వ మహాసభకు జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరై, పేద ప్రజల సమస్యలపై చర్చిస్తారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు తప్పక హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు షణ్ముగం, రమణయ్య, వీరాస్వామి, గురవమ్మ, తదితరులు పాల్గొన్నారు.

### 40 మందికి ఉచిత కంటి పరీక్షలు

కేవీబీపురం: మండలంలోని కొండల్లోఆధవరంలో భక్తకన్నప్ప కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం 40 మందికి కంటి పరీక్షలు ఉచితంగా చేశారు. పలువురికి ఉచితంగా కంటి అద్దాలను అందజేశారు. మరి కొందరిని కంటి ఆపరేషన్లకు సిఫారసు చేసి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ దొరస్వామి, ప్రగతి సంస్థ సభ్యులు ప్రభాకర్, వైద్యసిబ్బంది భవానీ ప్రియ పాల్గొన్నారు.

### విద్యా సామగ్రి పంపిణీ



విద్యాసామగ్రిని అందిస్తున్న ఎస్‌ఐ నాగరాజు

రేణిగుంట: మండలంలోని గురవరాజు పల్లి ఎస్టీ కాలనీ, నీలాద్రి కాలనీలో శనివారం సోషల్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో 80 మంది పిల్లలకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో అర్బన్ ఎస్‌ఐ నాగరాజు ట్రైనీ ఎస్‌ఐ స్వాతి, రాస్ చైల్డ్ ఫండ్ ఇండియా డైరెక్టర్ రమేష్ రెడ్డి, సిర్డ్స్ సంస్థ వ్యవస్థాపకులు హేమ శేఖర్, మహిళా పోలీస్ తేజస్విని, కో–ఆర్డినేటర్ తేజోవతి పాల్గొన్నారు.

### స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో ఉన్నత విలువలు



స్కౌట్ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న రమేష్‌బాబు

శ్రీకాళహస్తి: స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరడం వల్ల విద్యార్థులకు ఉన్నత విలువలు పెంపొందుతాయని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యాలయ కమిషనర్ రమేష్ బాబు తెలిపారు. పట్టణంలోని బాబు అగ్రహారం పురపాలక ఉన్నత పాఠశాల ఆవరణంలో ఇటీవల తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంపులో ఉత్తీర్ణులైన స్కౌట్స్ విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చిన్నతనం నుంచే క్రమశిక్షణ, సేవానిరతి, దేశభక్తి వంటి ఉత్తమ లక్షణాలు అలవరిచేందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎంతగానో దోహదం చేస్తుందని అన్నారు. తృతీయ సోపాన్, రాజ్యపురస్కార్ వంటి సర్టిఫికెట్స్ పొందిన వారికి ఉన్నత విద్య ప్రవేశాలకు 0.05 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. అనంతర స్కౌట్ మాస్టర్ షేక్ అజారుద్దీన్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ కె. రఫీ, మునిరాజ, ఎం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నిధులు జేబులోకి.. నీళ్లు సంతలోకి!

- వారపు సంత రొచ్చురొచ్చు
- ప్రజలకు తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

సాక్షి టాస్క్ ఫోర్స్: దాదాపు వందేళ్ల చరిత్ర కలిగిన రేణిగుంట వారపు సంత మురుగు నీటి గుంటలతో నిండిపోయింది. గతంలో సాక్షిలో ప్రచురించిన కథనానికి స్పందించిన స్థానిక శాసనసభ్యులు సుధీర్ రెడ్డి ప్రత్యక్షంగా పరిశీలించి స్థానిక అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. కోటి రూపాయల వ్యయంతో ఆరు నెలల్లో పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని ఆదేశించారు. అందులో భాగంగా వారం రోజుల్లోనే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఇదే అదునుగా భావించిన స్థానిక అధికార పార్టీ నాయకులు పంచాయతీ నిధులు స్వాహా చేసేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. అభివృద్ధి పనులకు సంబంధించి నామినేటెడ్‌గా పనులను సొంతం చేసుకుని అధికారులతో కుమ్మక్కై అరకొర పనులు చేసి సుమారు రూ.30 లక్షల వరకు పంచాయతీ నిధులను స్వాహా చేశారన్న విమర్శలు వినపడుతున్నాయి.



సంతలో బురదగుంటల మధ్య అవస్థలు పడుతున్న కొనుగోలు, విక్రయదారులు



సంతలో రొచ్చురొచ్చుగా మారిన రోడ్డు

**ఎక్కడి మురుగు అక్కడే...**

వరుసగా పడిన వర్షాలు, అరకొరగా చేసిన పనుల వల్ల ఎక్కడి మురుగు అక్కడే అన్న చందంగా తయారైంది. సంత రోజు ఇక్కడ ఉన్న మురుగు గుంటలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీ అధికారులకు సంత ఆదాయంపై ఉన్న శ్రద్ధ సదుపాయాలు కల్పించడంలో లేదని విమర్శలు వినపడుతున్నాయి.

**ఎమ్మెల్యేకు తెలిసే జరిగిందా..?**

వారపు సంతను అభివృద్ధి చేస్తానని మాట ఇచ్చిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి తెలిసే ఈ నిధులు స్వాహా జరిగిందా లేదా స్థానిక నాయకులు ఆయన్ని మభ్య పెట్టి అధికారులతో కలిసి అరకొర పనులు చేసి నిధులు స్వాహా చేశారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోసారి ప్రత్యక్షంగా ఎమ్మెల్యే సంతను శనివారం రోజున పరిశీలిస్తే వ్యాపారస్తులు, కొనుగోలుదారులు పడుతున్న ఇబ్బందులు తెలుస్తాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**మరి ఈ పనులు ఎప్పుడో..?**

గతంలో ఎమ్మెల్యే పరిశీలించినప్పుడు సంతలో సిమెంటు రోడ్లు, వీధి కాలవలు, షెడ్లు, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం, సీసీ కెమెరాలు, ప్రధాన ద్వారానికి గేట్లు పెట్టిస్తామని హామీ ఇచ్చారు. ఇందులో ఒక్క పని కూడా పూర్తికాలేదు. కానీ రూ.30 లక్షలు ఖర్చయినట్లు లెక్కలు చూపిస్తున్నారు. ఈ పనులు ఎప్పుడు చేస్తారో దీనిని అడ్డుపెట్టుకొని ఎంత స్వాహా చేస్తారో అంటూ పలువురు చర్చించుకుంటున్నారు.



బురద గుంటగా మారిన సంత స్థలంలోని రోడ్డు



సంతలోని మరో రోడ్డు దుస్థితి



మురుగునీటి కాలువగా మారిన మరో రోడ్డు

### పోలీస్-మీడియా మైత్రి చాలా అవసరం

శ్రీకాళహస్తి: పోలీస్, మీడియా మధ్య మైత్రి సమాజానికి చాలా అవసరమని వన్ టౌన్ సీఐ గోపి అభిప్రాయపడ్డారు. శ్రీకాళహస్తి సబ్ డివిజన్ పోలీస్ శాఖ పరిధిలో పనిచేస్తున్న జర్నలిస్టుల వాహనాలకు పోలీస్ ప్రెస్ స్టిక్కర్ల మంజూరు అంశంపై శనివారం ప్రెస్ క్లబ్ కమిటీ సీఐను కలవగా ఆయన చాలా సానుకూలంగా స్పందించారు. ప్రెస్‌క్లబ్ కమిటీ ప్రతిపాదించిన ప్రతి జర్నలిస్టుకి ప్రెస్ స్టిక్కర్లు అందజేస్తామని హామీ ఇచ్చారు. పోలీస్ శాఖ తరపున శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్‌కు నాణ్యమైన క్రికెట్ కిట్‌ను అందజేయనున్నట్లు హామీ ఇచ్చారు.

### మాజీ ఎమ్మెల్యే పరామర్శ



రేణిగుంట: నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి

ఏర్పేడు: మండలంలోని మర్రిమందలో కళత్తూరు రామ్మూర్తిరెడ్డి మృతి చెందడంతో శనివారం శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆయన పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబీకులను పరామర్శించారు.

రేణిగుంట: మండలంలోని అత్తూరు గ్రామానికి చెందిన అత్తూరు ఓబుల్ రెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం అందుకున్న బియ్యపు మధుసూదన్ రెడ్డి శనివారం గ్రామానికి చేరుకొని ఆయన పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

## వరకట్నం వేధింపులపై కేసు నమోదు



బాధితురాలు గౌరి

కేవీబీపురం: వరకట్న వేధింపులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. మండలంలోని ఆరె గ్రామానికి చెందిన ఏ.గౌరి అనే మహిళకు సుమారు ఐదేళ్ల కిందట అదే గ్రామానికి చెందిన బాలసుబ్రమణ్యం అనే వ్యక్తితో వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. అయితే పెళ్లి సమయంలో కట్నకానుకల్లో భాగంగా బంగారంతోపాటు, కొంత నగదు ఇచ్చారు. కొద్దిరోజులకే భర్త వ్యసనాలకు బానిస కావడంతో తరచూ ఇంట్లో గొడవలు జరిగేవి. అప్పటి నుంచి తాను తెచ్చిన కట్నం సరిపోదంటూ భర్త బాలసుబ్రమణ్యం, అతని తల్లి దేశమ్మ కలిసి తనను చిత్రహింసలు పెట్టేవారని, అయినప్పటికీ తాను అన్నీ భరించి కాపురాన్ని నెట్టుకొస్తున్నానని గౌరి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. తన భర్త, అత్తలు తనకి తెలియకుండా తాను తినే ఆహారంలో విషం కలిపి హతమార్చాలని చూశారని ఫిర్యాదు పేర్కొంది. తనకు ప్రాణహాని జరిగితే తన బిడ్డ అనాథగా మారుతాడని, తన భర్త, అత్తలపై చర్యలు తీసుకుని, తనను రక్షించాలని పోలీసులను కోరింది. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### మత్తుకు దూరంగా ఉండాలి

రేణిగుంట: యువకులు మత్తుకు దూరంగా ఉంటూ చవితి సంబరాలను జరుపుకోవాలని సీఐ మంజునాథరెడ్డి తెలిపారు. మండలంలోని అల్లికేశంలో శనివారం రాత్రి ఆయనతోపాటు ఎస్‌ఐ సుధాకర్ వినాయక చవితి కమిటీ మెంబర్లు, గ్రామస్తులతో సమావేశమయ్యారు. చవితి సంబరాల్లో యువకులు మత్తు పానీయాలకు దూరంగా ఉండాలని, రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు.

### ఫిర్యాదుల పెట్టె ప్రారంభం

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో శనివారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ ఫిర్యాదుల పెట్టెను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ శ్రీకాళహస్తిలోని ఏరియా ఆస్పత్రిని మరింత అభివృద్ధి చేసి ఇక్కడ వచ్చే రోగులకు మెరుగైన వైద్య సౌకర్యాలతో పాటు మెరుగైన వసతులు కల్పించేందుకు ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేశామన్నారు.

## రోడ్లపై వసూళ్లు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న సీఐ తిమ్మయ్య

బుచ్చినాయుడుకండ్రిగ: వినాయక చవితి పండుగ నిర్వహణకు రోడ్లపై బలవంతపు వసూళ్లు చట్టరీత్యా నేరమని, అలా చేసిన వారిపై చర్యలు తప్పవని సీఐ తిమ్మయ్య, ఎస్‌ఐ విశ్వనాథ నాయుడు, పీఎస్‌ఐ సుధీర్‌రెడ్డి తెలిపారు. శనివారం వారు స్థానిక పోలీసుస్టేషన్‌లో మండలంలోని పలు గ్రామాల్లో వినాయక విగ్రహాల ఏర్పాటుపై చవితి నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ తిమ్మయ్య మాట్లాడుతూ వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసే ఉత్సవ కమిటీ సభ్యులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని తెలిపారు. వినాయక మండపాల వద్ద తాత్కాలిక అగ్నిమాపక, ఎలక్ట్రికల్ ప్రమాదాల నివారణ పరికరాలను అందుబాటులో ఉంచాలన్నారు. విగ్రహం ఊరేగించే సమయంలో రోడ్లపై ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఊరేగించాలని తెలిపారు. విగ్రహం విద్యుత్ వైర్లు తగలకుండా చూసుకోవాలని, విగ్రహ నిమజ్జనంలో ఈతరానివారు విగ్రహంతోపాటు నీళ్లలోకి దిగకుండా ఉత్సవ కమిటీ తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఉత్సవాల్లో మద్యం సేవించడం, డీజే ఏర్పాటు, బాణసంచా పేల్చడం చేయకూడదని హెచ్చరించారు. నిబంధనలను ఉల్లంగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## ఘనంగా ఆడికృత్తిక మహోత్సవాలు



రేణిగుంట: అన్న ప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు



ఏర్పేడు: కావళ్లు మోసుకెళుతున్న భక్తులు

రేణిగుంట: మండలంలోని గాజుల మండ్యం లో వెలసిన శ్రీ బాల సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో శనివారం ఆడికృత్తిక మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. గురువారం ధ్వజారోహణంతో ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ఉత్సవాల్లో చివరి రోజు ఆడికృత్తిక పర్వదినాన్ని పురస్కరించుకొని సుగంధ ద్రవ్యాలు, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం స్వామివారికి ఊంజల్ సేవ నిర్వహించారు.

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేటలో వెలసిన సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఆడికృత్తిక ఉత్సవాలు నిర్వహించారు. గ్రామంలో భక్తులు పసుపు దుస్తులు ధరించి, కావళ్లు మోసుకొని ఆలయానికి చేరుకుని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారిని గ్రామంలో ఊరేగించారు.

## ముక్కంటి ఆలయం.. భక్త జనసంద్రం



ఆలయం వద్ద కిక్కిరిసిన భక్తులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం శనివారం భక్త జనసంద్రంగా మారింది. వరుసగా శుక్ర, శని, ఆదివారాలు సెలవు రోజులు కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 30వేలమంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం 942 మంది, రూ.200 శీఘ్ర దర్శనం టికెట్ల ద్వారా 4,861 మంది, రూ.50 ప్రత్యేక దర్శనం టికెట్ల ద్వారా 2,919 మంది భక్తులు దర్శించుకున్నారు. రూ.500 రాహుకేతు టికెట్ల ద్వారా 2,798 మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,488, రూ.1500 టిక్కెట్ల ద్వారా 479 మంది. రూ.2,500 టిక్కెట్ల ద్వారా 373 మంది, రూ.5 వేలు టిక్కెట్ల ద్వారా 109 మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 28,287 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

## కృష్ణా ముకుందా మురారీ!



శ్రీకాళహస్తి: పుష్పయాగం

శ్రీకాళహస్తి: శ్రీకృష్ణాష్టమి వేడుకలను శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లో శనివారం వైభవంగా నిర్వహించారు. అందులో భాగంగా శ్రీకాళహస్తి చెంచు లక్ష్మీ కాలనీ ఉన్న శ్రీకృష్ణ మందిరంలో పుష్పయాగం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సుమారు టన్ను పుష్పాలు వినియోగించారు. గోవింద నామ స్మరణలు చేస్తూ భక్తులు ప్రణమిల్లారు. పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి సమీపంలో వెలసిన శ్రీకృష్ణ స్వామి దేవాలయంలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో బిక్షాల గాలిగోపురం వద్ద ఉన్న సప్తగోకులం, దక్షిణ గాలిగోపురం వద్ద ఉన్న సప్తగోకులం, భరద్వాజతీర్థంలో ఉన్న గోశాలలో గోమాతలకు సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. పట్టణంలోని సరస్వతిశిశుమందిర్‌లో చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. వారి చేత ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు.

ఏర్పేడు: మండలంలో గుంటకట్ట వద్దనున్న వినాయక స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆమందూరు బీసీ కాలనీలో వెలసిన బాలకృష్ణుని ఆలయంతోపాటు, చింతలపాళెం, బండారుపల్లి, పాపానాయుడు పేట, అంజిమేడు గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు.

రేణిగుంట: స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఇస్కాన్ టెంపుల్ వారు నిర్వహించిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఆకట్టుకున్నాయి.రాధా కృష్ణులను భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శించుకున్నారు. చిన్నారులు రాధాకృష్ణుల వేషధారణలో అలరించారు. గాజుల మండ్యంలోని శ్రీకృష్ణ భజన మందిరంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. సాయంత్రం రాధా కృష్ణులకు ఊంజల్ సేవను నిర్వహించారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని శ్రీకృష్ణుడి ఆలయంలో శనివారం శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ కృష్ణుడి విగ్రహానికి అభిషేకాలు చేసి, పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. యోగగురువు సురేష్‌నాయుడు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

**ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు**

వరదయ్యపాళెం: శ్రీకృష్ణాష్టమి వేడుకలను గోవర్ధనపురంలోని త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం శ్రీకృష్ణుని ప్రతిమకు పూజలు, ఆరాధన జరిపారు. మధ్యాహ్నం సామూహిక భోజనాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామివారికి గ్రామోత్సం నిర్వహించారు. మహిళల కోలాట నృత్యాలు, భాజాభజంత్రీల నడుమ గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు, వారి వారి ఇళ్ల వద్ద కర్పూర హారతులిచ్చి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే వరదయ్యపాళెంలోని త్రయంబకేశ్వరాలయంలో కృష్ణాష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు.







శ్రీకాళహస్తి: శ్రీకృష్ణుడి సన్నిధిలో బియ్యపు మధుసూదన్‌రెడ్డి, బుచ్చినాయుడుకండ్రిగలో పూజలు, వరదయ్యపాళెం: కోలాటాల మధ్య ఊరేగుతున్న శ్రీకృష్ణుడు

# టీడీపీ నేతలకు స్వతంత్ర ముడుపులు

- సోషల్ మీడియాలో బట్టబయలైన జాబితా
- సత్యవేడు నియోజకవర్గంలో సంచలనం



సోషల్ మీడియాలో సంచలనం రేపుతున్న టీడీపీ వెన్నుపోటుదారుల జాబితా

వరదయ్యపాళెం: గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో సత్యవేడు నియోజకవర్గం నుంచి పోటీచేసిన స్వతంత్ర అభ్యర్థి యాతాటి రమేష్ వద్ద నుంచి టీడీపీ నాయకులు పెద్దఎత్తున ఓటర్ల పంపిణీ పేరుతో ముడుపులు తీసుకున్నారని, వారి జాబితా తాజాగా శనివారం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. దీంతో నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో ఇది చర్చనీయాంశమైంది. ఆ మేరకు సోషల్ మీడియాలో బట్టబయలైన జాబితా మేరకు రూ.10.50కోట్లకు పైగా నగదును 7 మండలాల్లోని పలువురు టీడీపీ నేతలకు ముట్టినట్లు తెలుస్తోంది. అయితే లోపాయికారికంగా స్వతంత్ర అభ్యర్థికి పనిచేసిన టీడీపీ వెన్నుపోటుదారులు నేడు దర్జాగా తాము అసలైన టీడీపీ నాయకుడంటూ కాలర్ ఎగరేయడం విమర్శలకు దారితీస్తోంది.

**టీడీపీ నేతలకు ముట్టిన రూ.10.50కోట్లు ?**

గత సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి సత్యవేడు నియోజకవర్గంలో స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థిగా యాతాటి రమేష్ బరిలోకి దిగారు. ఆయన ప్రారంభం నుంచి నియోజకవర్గంలోని టీడీపీకి చెందిన ఓ వర్గం నేతలను వెంటబెట్టుకుని ప్రచారం చేపట్టారు. ఆ దశగా 7 మండలాల్లో ఇదే ప్రక్రియ కొనసాగింది. దీంతో ఇదే అదునుగా భావించిన టీడీపీ నేతలు స్వతంత్ర అభ్యర్థి నుంచి పెద్దఎత్తున ఓటర్లకు పంపిణీ చేసేందుకు రూ.10.50 కోట్లు ముడుపులు అందుకున్నారని సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్న వివరాల ద్వారా తెలుస్తోంది. ఆ మేరకు బీఎన్ కండ్రిగ మండలానికి సంబంధించి ఆరుగురు నేతలు రూ.1.50కోట్లను అందుకున్నారు. కేవీబీపురం మండలంలో మరో ఆరుగురు రూ.1.50కోట్లను స్వీకరించారు. నారాయణవనం మండలంలో నలుగురు రూ. 2కోట్లను అందుకున్నారు. నాగలాపురం మండలంలో నలుగురు రూ.1.50కోట్లు, సత్యవేడు మండలంలో ఆరుగురు నాయకులు రూ.3కోట్లను అందుకున్నారు. వరదయ్యపాళెం మండలంలో ఐదుగురు రూ.కోటి అందుకున్నట్లుగా అందులో పొందుపరచి ఉంది. అయితే వీరంతా టీడీపీ అభ్యర్థి ఆదిమూలంను వ్యతిరేకించిన వారే అని తెలుస్తోంది.

**వెన్నుపోటుదారులే అసలైన నేతలుగా చెలామణి**

సార్వత్రిక ఎన్నికల్లో తెర వెనుక టీడీపీకి వెన్నుపోటు పొడిచిన నాయకులు ఏడాది పాటు స్తబ్దుగా ఉండిపోయారు. నెలరోజుల క్రితం ప్రోగామ్ కో–ఆర్డినేటర్‌గా తిరుపతికి చెందిన శంకర్ రెడ్డి నియమితులయ్యారు. ఇదే అదునుగా భావించిన టీడీపీ వెన్నుపోటుదారులు అసలైన కార్యకర్తలుగా ఆయన ముందు ఫోజులిస్తూ వెలుగులోకి వచ్చారు. ఇవేమీ లెక్కచేయని ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ శంకర్ రెడ్డి మాత్రం ఇవేమీ తనకు తెలియదనట్టుగా తాను కార్యక్రమానికి హాజరైనప్పుడు హంగామా, ఆర్భాటాలు చూపితే వారే అసలైన టీడీపీ కార్యకర్తలుగా పరిగణనలోకి తీసుకుంటూ పని కానిచ్చేస్తుండడం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది.

**స్వతంత్ర అభ్యర్థిని మట్టికరిపించి..**

సత్యవేడు నియోజకవర్గంలోని టీడీపీ నేతలు సార్వత్రిక ఎన్నికలో స్వతంత్ర అభ్యర్థి యాతాటి రమేష్‌ను మాయమాటలతో మట్టి కరిపించారని తెలుస్తోంది. తాము మండలాల వారీగా గ్రామాల్లో ప్రభావితం చేసే నాయకులు అన్నట్లు ఆయన వద్ద మాయమాటలు చెప్పి పెద్దఎత్తున ముడుపులు పొంది ఇల్లు చక్కబెట్టుకున్నారని ప్రచారం సాగుతోంది. వెన్నుపోటు టీడీపీ నేతల మాయలో పడ్డ స్వతంత్ర అభ్యర్థి ఇష్టారాజ్యంగా ఖర్చు పెట్టి కనీసం 5వేలు ఓట్లు కూడా వేసుకోలేక వెనుదిరిగారు. దీంతో గొప్పలు చెప్పిన వెన్నుపోటు టీడీపీ నేతలు ఆయన వద్ద ఎంచక్కా ముఖం చాటేయడం గమనార్హం.

### నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



అధికారులకు విరాళం అందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శనివారం కుమారదేవంకు చెందిన కాసారి శ్రీహరి గౌడ్ దంపతులు తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ.1,00,116ను విరాళంగా ఇచ్చారు. ఆలయ అధికారులు దాతలకు స్వామి అమ్మవార్ల ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.